సాక్షి తూర్పుగోదావరి

మంగళవారం । 21 । మార్చి । 2023



బదనికలతో రక్షణ


కొబ్బరిని ఆశించి, అపారంగా నష్టపరుస్తున్న హానికర పురుగుల నివారణ.. మిత్ర పురుగుల తోనే సంపూర్ణంగా సాధ్యమవుతుందని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. - 8లో▸



శ్రీవారి సేవలో ఎన్‌హెచ్‌ఏఐ సీజీఎం

ద్వారకాతిరుమల: చినవెంకన్న ఆలయాన్ని నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా సీజీఎం రాజీవ్ అగర్వాల్ సోమవారం సందర్శించారు.


డెల్టాలకు నీరు విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజి నుంచి గోదావరి డెల్టా కాలువలకు సోమవా రం 5,855 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 1730, మధ్య డెల్టాకు 1125, పశ్చిమ డెల్టాకు 3000 క్యూసెక్కులు వదిలారు.

పాపం పసివాళ్లు

- పోర్న్ వీడియోలతో పైశాచికానందం
- పోలీసులకు పట్టుబడ్డ ప్రబుద్ధులు
- నిందితుల్లో విద్యావంతులే ఎక్కువ
- కేంద్ర హోంశాఖ ప్రాథమిక సమాచారం
- ఉమ్మడి తూర్పులో 367 మందిపై కేసులు
- 150 మందికి 41ఎ నోటీసులు
- ఆరు నెలల విచారణలో నిగ్గు తేలిన నిజాలు



సాక్షి ప్రతినిధి, కాకినాడ: మొబైల్ ఫోన్ నిత్యావసరమై పోయింది. ఇది చేతిలో లేకుండా గుమ్మం దాట లేని పరిస్థితి. నిద్ర లేచిన దగ్గర నుంచి సెల్ ఫోన్ లేకుండా క్షణం గడవదు. మూడేళ్ల చిన్నారి నుంచి పండు ముదుసలి వరకూ ఎవరి చేతిలో చూసినా సెల్ లేకుండా ఉండదు. కొందరు వీటిని వీక్షిస్తూ పక్కదారి పడుతున్న వైనాలు ఆందోళన కలిగిస్తున్నాయి. కొందరు విద్యావంతులు, నడి వయస్సు వారు కూడా మొబైల్‌లో పిల్లల పోర్న్ (నీలి) చిత్రాల ప్రవాహంలో కొట్టుకుపోతున్నారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో మొబైల్ ఫోన్లలో విచ్చలవిడిగా చూస్తున్న చిన్నారుల నీలి చిత్రాలపై పోలీసు శాఖ లోతైన విచారణ చేపట్టింది. ఇందులో ఆందోళన కలిగించే అనేక అంశాలు వెలుగులోకి వచ్చాయి.

స్వచ్ఛంద సంస్థతో కలిసి జాయింట్ ఆపరేషన్

పిల్లల పోర్న్ వీడియోలు చూస్తూ పైశాచికానందం పొందుతున్న ప్రబుద్ధుల నిర్వాకాన్ని సాంకేతికత సాయంతో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో పోలీసులు ఛేదించారు. చిన్న పిల్లలతో పాడు పనులు చేస్తూ పైశాచికానందం పొందడం, అది చాలదన్నట్టు షూట్ చేయడం, చూస్తూ ఆనందం పొందుతూ మరి కొందరికి షేర్ చేస్తున్న వారి భరతం పడుతున్నారు. ఇటువంటి వారి ఆట కట్టించేందుకు స్వచ్ఛంద సంస్థ నేషనల్ సెంటర్ ఫర్ మిస్సింగ్ అండ్ ఎక్స్‌ప్లాయిటెడ్ చిల్డ్రన్(ఎన్‌సీఎంఈసీ)తో పోలీసు శాఖ చేపట్టిన జాయింట్ ఆపరేషన్ ఫలితాన్నిచ్చింది. దీంతో పలు కేసులు నమోదు చేశారు. ఈ వీడియోలు చూస్తున్న, షేర్ చేస్తున్న వారి మొబైల్ నంబర్లు, అడ్రస్‌లు కేంద్ర హోం శాఖ నుంచి పోలీసు ఉన్నతాధికారులకు వచ్చాయి. ఆ సమాచారం జిల్లాకు వచ్చాక కాకినాడ దిశ డీఎస్పీ సుంకర మురళీమోహన్ పర్యవేక్షణలో ఆరు నెలల పాటు పోలీసులు పలు రాష్ట్రాల్లో పర్యటించి నిందితుల కూపీ లాగారు.

అరెస్టుల పర్వం

కాకినాడ పోర్టులో పని చేసే ఒక ఉద్యోగిపై కేంద్ర హోం శాఖ నుంచి వర్తమానం వచ్చింది. చైల్డ్ పోర్న్ వీడియోలు అతడి మొబైల్ నుంచి సర్క్యులేట్ అయినట్టు తేలింది. ఆరా తీసేందుకు పోర్టుకు వెళ్లేసరికి నిందితుడు అప్పటికే సొంత రాష్ట్రం రాజస్థాన్ వెళ్లిపోయాడు. ఇక్కడి పోలీసు బృందం రాజస్థాన్ వెళ్లి కేసు నమోదు చేసి తీసుకువచ్చింది. మరో నిందితుడు సామర్లకోట రైల్వే స్టేషన్ ప్రాంతం నుంచి ఈ పోర్న్ వీడియోలు షేర్ చేసినట్టు తేల్చారు. సామర్లకోట వెళ్లేసరికి నిందితుడు అక్కడి నుంచి హైదరాబాద్ వెళ్లినట్టు గుర్తించారు. అక్కడకు వెళ్లి కేసు నమోదు చేశారు. గడచిన ఆరు నెలల్లో 367 మందిపై కేసులు నమోదయ్యాయి. మరో 150 మందికి 41ఏ నోటీసులు జారీ చేశారు. పట్టుబడ్డ నిందితుల్లో ఉన్నత విద్యావంతులే ఎక్కువగా ఉన్నారు. ఎంటెక్, మెడిసిన్ చేస్తున్న వారి సంఖ్య ఎక్కువగా ఉంది. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లతో పాటు విశ్రాంత ఉద్యోగులు, చివరకు మైనర్లూ ఈ నిర్వాకంలో ఉన్నారని విచారణలో నిగ్గు తేలింది.

'ఎక్స్‌ప్లాయిటేషన్'పై ఉక్కుపాదం

పెద్దల చిన్ననాటి నగ్న, అర్ధనగ్న చిత్రాలు సేకరించడమే కాకుండా షేర్ చేస్తున్న నిందితుల బండారం బట్టబయలైంది. ఈ తరహా వ్యవహారాలు మూడు జిల్లాల్లోని మారుమూల గ్రామాల్లో కూడా గుర్తించడం విశేషం. రాజమహేంద్రవరం, కాకినాడ నగరాలతో పాటు ఒక మోస్తరు పట్టణ ప్రాంతాల్లో కూడా విచ్చలవిడిగా చిన్నారుల పోర్న్ వీడియోలు ప్రసార మాధ్యమాల ద్వారా సర్క్యులేట్ అవుతున్నట్టు గుర్తించారు.

'టిప్‌లైన్'తో పట్టేస్తున్నారు

- **చైల్డ్ పోర్నోగ్రఫీకి అల**వాటు పడిన ప్రబుద్ధుల **బండారం పోలీసులు** 'టిప్ లైన్' యాప్ సాం**కేతికతతో బయటప**డింది.
- **మొబైల్ లేదా గాడ్జెట్**లో వీక్షించి, షేర్ చేసినా, **మొబైల్‌లో అప్‌లోడ్** చేసినా ఆ విషయం **నేరుగా కేంద్ర హోం** శాఖకు చేరుతుంది.
- **టిప్‌లైన్ ద్వారా ఆ** వీడియోలో ఎనిమిది **రకాల వివరాలు సేక**రిస్తున్నారు.
- **వీడియో పంపిన, అప్‌**లోడ్ చేసిన ఎలక్ట్రానిక్ **పరికరంతో పాటు** ఇంటర్నెట్ ప్రొటోకాల్ **వివరం, వీడియో** ఏ ప్రాంతం నుంచి ఏ సమయంలో పంపించారు, వీడియో నిడివి, పంపిన వీడియో ఎవరికి లేదా ఏ గ్రూప్‌కి చేరింది, వీడియో పంపిన వ్యక్తి చిరునామా సహా పూర్తి వివరాలను వెలుగులోకి తేవడంలో టిప్‌లైన్ సాంకేతికత ఉపయోగపడింది.
- నిందితుల ప్రాథమిక సమాచారం కేంద్ర హోం మంత్రిత్వ శాఖ నుంచి పోలీసు హెడ్ క్వార్టర్స్, అక్కడి నుంచి జిల్లా పోలీసు యంత్రాంగానికి వచ్చింది.
- ఆ వివరాలను దిశ పోలీస్ విభాగం పరిశీలించి, వల పన్ని కేసులు నమోదు చేసింది. దిశ డీఎస్పీ సుంకర మురళీమోహన్ పర్యవేక్షణలో సీఐ రాజశేఖర్ ఆధ్వర్యాన ఈ చైల్డ్ పోర్న్ కేసుల విచారణ కొనసాగుతోంది.
- నిందితులను పట్టుకునేందుకు రాజశేఖర్ బృందం ఇప్పటికే దేశంలోని పలు రాష్ట్రాలకు వెళ్లొచ్చింది.
- వివిధ ప్రాంతాల్లో ఉన్న నిందితులను జిల్లాకు తీసుకొచ్చి కేసులు నమోదు చేస్తున్నారు.

మగ పిల్లలకు ప్రమాదమే



చిన్నపిల్లలపై అఘాయిత్యాలకు పాల్పడే వారి మనస్తత్వాన్ని చాలా నిశితంగా పరిశీలించాం. కామవాంఛ తీర్చుకోవాలనుకునే వారికి పసిపిల్లల లింగభేదంతో పని లేదు. ఇటువంటి వారి వల్ల ఆడపిల్లలతో పాటు మగపిల్లలకూ ప్రమాదమే. పోర్న్ వీడియోలు చూస్తూ సంతృప్తి చెందేవారి వైఖరి అత్యంత ప్రమాదకరమైనది. ఏ పిల్లల్ని చూసినా వారికి ఈ తరహా ఆలోచనలే వస్తాయి. ఈ స్థితిని మానసిక వైద్య పరిభాషలో పీడియో ఫిలియాగా పిలుస్తారు. ఇటువంటి లైంగిక వాంఛలకు బలయ్యే చిన్నారులకు బయటి వారి నుంచి కంటే సొంత వారు, తెలిసిన వారి నుంచే ప్రమాదం పొంచి ఉంటుంది. న్యూరో హార్మోన్స్ డోపమైన్, సెరటనీన్‌ల ప్రేరేపణ, అసమతుల్యత ఈ తరహా మానసిక స్థితికి కారణం. చిన్నపిల్లలపై వాంఛలు, వీడియోలు వీక్షించే వారు ఆ స్థితి నుంచి తక్షణమే బయటపడాలి. సాధ్యం కాకుంటే మానసిక వైద్య నిపుణుడిని సంప్రదించాలి.

– డాక్టర్ పాశం రవిశంకర్, ప్రొఫెసర్ ఆఫ్ సైకియాట్రీ, కాకినాడ

విద్యార్థులే అధికం



చిన్నపిల్లల పోర్న్ వీడియోలు చూస్తూ షేర్ చేస్తున్న వారిలో ఎక్కువ మంది విద్యార్థులే ఉండటం విస్మయానికి గురి చేసింది. విద్యార్థులతో పాటు మైనర్లు కూడా ఉన్నట్టు గుర్తించాం. నిందితుల్లో ఎక్కువ మంది ఉద్దేశపూర్వకంగా నేరానికి పాల్పడ్డట్టు తేలింది. మరికొంత మందికి కనీస అవగాహన లేదు. ఇటువంటి నిర్వాకానికి జైలు, జరిమానా తప్పదు. సరదా కోసమో, హాస్యానికో, లైక్‌లు షేర్ల కోసమో ఈ పనులు చేయడం చట్టరీత్యా నేరం.

– ఎం.రవీంద్రనాథ్‌బాబు, ఎస్పీ, కాకినాడ జిల్లా

రఘురామపై ఎంపీ భరత్ ఆగ్రహం



విలేకరులతో మాట్లాడుతున్న ఎంపీ భరత్‌రామ్

రాజమహేంద్రవరం సిటీ: దమ్ముంటే రాజమహేంద్రవరం పార్లమెంట్ నియోజకవర్గంలో తనపై పోటీ చేసి గెలవాలంటూ నరసాపురం ఎంపీ రఘురామకృష్ణంరాజుకు రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్ రామ్ సవాల్ విసిరారు. సోమవారం రాజమహేంద్రవరంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ మీడియా ముందు ఇష్టం వచ్చినట్లు మాట్లాడటం తగదంటూ తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. రఘురామకృష్ణంరాజు బతిమలాడితే జగనన్న నరసాపురం నుంచి పోటీ చేసేందుకు అవకాశం కల్పించారన్నారు. తీరా నెగ్గాక అటు టీడీపీతో ఇటు బీజేపీతో శిఖండిలా మంతనాలు చేస్తున్నారంటూ విమర్శించారు. కొంతమంది పేటీఎం బ్యాచ్‌ను రాజమహేంద్రవరంలో పెట్టుకుని లేనిపోని ప్రచారం చేయిస్తున్నారన్నారు. నోరు అదుపులో పెట్టుకోవాలని హెచ్చరించారు. రాజమహేంద్రవరంలో టీడీపీ, జనసేన.. ఏ పార్టీ నుంచి రఘురామ పోటీ చేసినా లక్ష ఓట్లకు పైగా మెజారిటీతో తాను గెలిచి చూపిస్తానన్నారు. ఆవ భూములకు సంబంధించి ఆరోపణలు మానుకోవాలన్నారు. ఒక్క రూపాయి అవినీతి చేసినట్లు ఆధారమున్నా నిరూపించాలన్నారు. బ్యాంకుల నుంచి బినామీ పేర్లతో కోట్లాది రూపాయలు ఎగ్గొట్టడం తనకు చేతకాదన్నారు. తాను సొంత డబ్బుతోనే రాజకీయాలు చేస్తానని భరత్‌రామ్ పేర్కొన్నారు.

న్యూస్‌రీల్

ఇంటర్ పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్



పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ మాధవీలత, చిత్రంలో జోన్ 1,2 రీజియన్ జాయింట్ డైరెక్టర్ శారద

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయని కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత తెలిపారు. ఇంటర్ పరీక్షలు జరుగుతున్న ఏకేసీ కళాశాల కేంద్రాన్ని ఆమె సోమవారం తనిఖీ చేశారు. పరీక్షల నిర్వహణను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. అనంతరం ఏకేసీ కళాశాలలో జరుగుతున్న నాడు–నేడు పనులను పరిశీలించారు. కలెక్టర్ వెంట జోన్ 1,2 రీజియన్ జాయింట్ డైరెక్టర్ శారద, ఇంటర్మీడియట్ ప్రాంతీయ తనిఖీ అధికారి ఎన్ఎస్ఎల్వీ.నరసింహం తదితరులు ఉన్నారు.

స్పందన ఈదా ఇంటర్నేషనల్ ఫౌండేషన్ గౌరవ సలహాదారునిగా డాక్టర్ రామారెడ్డి



కంబాలచెరువు(రాజమహేంద్రవరం): నగరానికి చెందిన ప్రముఖ మానసిక వైద్యులు డాక్టర్ కర్రి రామారెడ్డికి మరో విశిష్ట గౌరవం లభించింది. గుంటూరుకు చెందిన స్వచ్ఛంద సంస్థ 'స్పందన ఈదా ఇంటర్నేషనల్ ఫౌండేషన్'కు గౌరవ సలహాదారునిగా నియమితులయ్యారు. ఆ సంస్థ డైరెక్టర్ ఈదా అంజిరెడ్డి సోమవారం మీడియాకు తెలిపారు. ఆత్మహత్య రహిత దేశాన్ని నిర్మించడానికి, విలువైన మానవ జీవితాలను రక్షించే దిశగా తమ సంస్థ నిర్విరామ కృషి చేస్తోందని చెప్పారు. సంస్థ కార్యకలాపాలను విస్తృతం చేసేందుకు జిల్లా యూనిట్‌గా ప్రముఖులతో కమిటీలను నియమిస్తున్నామన్నారు. ఈ జిల్లాలో సలహాదారులుగా ఉపాధ్యాయులు చిలుకూరి శ్రీనివాసరావు, పరస జగన్నాథరావులను నియమించినట్టు తెలిపారు. సంస్థ గౌరవ డైరెక్టర్లు సీహెచ్.శ్రీనివాసమూర్తి, డాక్టర్ పులుగు కిశోర్ కుమార్ పాల్గొన్నారు.

జిల్లాలో సగటున 7.0 మి.మీ. వర్షపాతం నమోదు

కొవ్వూరు: బంగాళాఖాతంలో ఏర్పడిన ద్రోణి, ఉపరితల ఆవర్తనమానం ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా పలుచోట్ల చెదురుమదురుగా చినుకులు పడ్డాయి. ఆదివారం ఉదయం ఎనిమిది గంటల నుంచి సోమవారం ఉదయం ఎనిమిది గంటల మధ్య సరాసరి 7.0మి.మీటర్లు వర్షపాతం నమోదైంది. గరిష్టంగా కోరుకొండలో 28.4 మి.మీటర్ల వర్షం పడింది. సీతానగరంలో 16.4, గోకవరంలో 25.2, రాజమహేంద్రవరం అర్బన్ లో 6.2, రాజానగరంలో 4.2, రంగంపేటలో 5.4 మి.మీటర్లు చొప్పున, తాళ్లపూడిలో 14.2, దేవరపల్లిలో 20.2, చాగల్లులో 6.6, నిడదవోలులో 4.4 మి.మీటర్లు చొప్పున వర్షం కురిసింది. ఉండ్రాజవరం, కొవ్వూరుల్లో స్వల్పంగా చినుకులు పడ్డాయి. సోమవారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకూ కొన్ని ప్రాంతాల్లో గట్టిగా గాలులు వీచాయి. మామిడి రైతులు ఆందోళన చెందారు.

ఏఎన్‌ఎం జిల్లా కార్యవర్గం ఎన్నిక



నూతన కార్యవర్గ సభ్యులు

కంబాలచెరువు: స్థానిక ప్రభుత్వాసుపత్రిలో సోమవారం ఏఎన్‌ఎంల జిల్లా స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షురాలిగా సూర్యకుమారి, అధ్యక్షురాలిగా కె.జయవాణి, వైస్ ప్రెసిడెంట్‌గా పద్మావతి, సెక్రటరీగా ఎస్వీ.రమాదేవి, ట్రెజరర్‌గా ఎన్.రాజేశ్వరి, ఇతర సభ్యులు ఎన్నికయ్యారు.

జిల్లాలో 52.50 లక్షల ఉపాధి పని దినాలు

రాజమహేంద్రవరం సిటీ: జిల్లాలో ఉపాధికి సంబంధించి 59 లక్షల పనిదినాలు లక్ష్యం కాగా సోమవారానికి 52.50 లక్షలు పూర్తి చేశామని కలెక్టర్ కె.మాధవీలత తెలిపారు. సోమవారం మండల స్థాయి అధికారులు, ఫీల్డ్ అసిస్టెంట్లతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రతిరోజూ 6 వేల ఉపాధి హామీ పనిదినాలు లక్ష్యంగా నిర్దేశించామన్నారు. రెండు రోజులుగా లక్ష్యాన్ని మించి పనులు జరుగుతుండడంపై ఎంపీడీవోలను అభినందించారు. ఇదేస్ఫూర్తితో మార్చి 28 నాటికి లక్ష్యాన్ని పూర్తి చేయాలన్నారు.

హిందూ సనాతన ధర్మం విలువలను తెలుసుకోవాలి

కంచి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతి స్వామీజీ



దేవరపల్లిలోని శ్రీవారి సన్నిధిలో భక్తులకు హిందూ సనాతన ధర్మం విలువను వివరిస్తున్న కంచి కామకోటి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతి స్వామీజీ

దేవరపల్లి: హిందూ సనాతన ధర్మం విలువలను ప్రతి ఒక్కరు తెలుసకోవాలని, ధర్మంపై విశ్వాసం కలిగి ఉండాలని కంచికామకోటి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతి స్వామిజీ అన్నారు. దేవరపల్లిలోని శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి పుణ్యక్షేత్రంలో సోమవారం స్వామిజీ పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులనుద్దేశించి అనుగ్రహ భాషణం చేశారు. 13 ఏళ్ల వయసులో కంచి పీఠాన్ని నడిచే దేవుడిగా పేరుగాంచిన చంద్రశేఖరేంద్ర సరస్వతి శంకరాచార్య స్వామి అధిరోహించారన్నారు. క్రీ.శ. 2600 సంవత్సరాల క్రితం మొట్టమొదటి పీఠాధిపతి ఆదిశంకరాచార్యులని వివరించారు. శాస్త్రంలో అనేక రూపాలు ఉన్నాయన్నారు. ధర్మంలో దివ్యక్షేత్రాలు ఉన్నాయన్నారు. వీటిని అర్థం చేసుకునే జ్ఞానం ఉండాలన్నారు. సేవాభావం ఎక్కువ ఉంటే దీర్ఘకాలంగా.. శాశ్వతంగా మంచిఫలితాలు వస్తాయని పేర్కొన్నారు. భావిభారత సంస్కృతిని కాపాడే విధంగా పథకాలు ఉండాలన్నారు. విదేశాల్లోని భారతీయులకు తెలుగు భాష నేర్పించడానికి ప్రయత్నం చేస్తున్నట్టు స్వామీజీ తెలిపారు. భారతీయతను కాపాడటానికి వేదశాస్త్రాన్ని కాపాడుకోవాలని హితవు పలికారు. ప్రతి కుటుంబంలో ఒకరినైనా వేద పాఠశాలకు పంపాలని ఆయన సూచించారు. విజయయాత్రలో భాగంగా ఈనెల 18న స్వామిజీ దేవరపల్లికి వచ్చారు. స్థానిక ఆదిశంకరాచార్యుల జ్ఞానమందిరం, పార్వతి సమేత ఉమా రామలింగేశ్వరస్వామి ఆలయం, వేంకటేశ్వరస్వామి వారి ఆలయం, అయ్యప్పస్వామి ఆలయాలను సందర్శించి పూజలు చేశారు. గోపాలపురం రోడ్డులో నిర్మించనున్న పంచాయహిక జ్ఞాన మందిరం స్థలాన్ని సందర్శించారు. స్వామిజీకి రాత్రి భక్తులు వీడ్కోలు పలికారు.



దేవరపల్లిలోని అయ్యప్పస్వామి ఆలయం వద్ద భక్తులకు ప్రసాదాలు అందజేస్తున్న స్వామీజీ

అర్జీదారులు సంతృప్తి చెందేలా పరిష్కారం

- స్పందన ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి
- కలెక్టర్ మాధవీలత



స్పందనలో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ మాధవీలత

రాజమహేంద్రవరం సిటీ: ప్రజాసమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమంలో స్వీకరించిన అర్జీలకు అర్జీదారుడు సంతృప్తి పొందేలా వేగవంతంగా పరిష్కారం చూపాలని అన్ని శాఖల అధికారులను కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందనలో జిల్లా వ్యాప్తంగా తరలివచ్చిన ప్రజల నుంచి 190 అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఫిర్యాదులను క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి, పారదర్శకంగా విచారణ చేసి అర్జీదారుడు సంతృప్తి చెందేలా గడువులోగా పరిష్కరించాలన్నారు. అర్జీలను రాష్ట్రస్థాయి అధికారులు సమీక్షిస్తున్నందున గడువులోపు పరిష్కరించి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 383 అర్జీలు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిలో 48 గంటల్లోగా పరిష్కారం చేయాల్సింది ఒకటి, మూడు రోజుల్లో పరిష్కారం చేయాల్సినవి 10, తిరిగి వచ్చినవి 33 ఉన్నట్లు తెలిపారు.

జిల్లాను క్షయ రహితంగా తీర్చిదిద్దుదాం

జిల్లాను క్షయవ్యాధి రహితంగా తీర్చిదిద్దుదామని కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత పిలుపునిచ్చారు. మార్చి 24న జరిగే ప్రపంచ క్షయవ్యాధి దినోత్సవాన్ని జయప్రదం చేయాలన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో క్షయ వ్యాధి నిర్మూలన, ప్రధానమంత్రి టీబీ ముక్తభారత్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ క్షయ బాధితులకు పౌష్టికాహారం అందిస్తే త్వరితగతిన కోలుకొంటారన్నారు. ఈ మేరకు ప్రధానమంత్రి టీబీ ముక్త్ భారత్ అభియాన్ – నిక్షయ్ మిత్ర కార్యక్రమం ద్వారా రోగులకు ఆరు నెలల పాటు పౌష్టికాహారం అందించడానికి దాతలు ముందుకు రావాలని కోరారు. జిల్లాలోని స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది నిక్షయ మిత్రలుగా భాగస్వాములై టీబీని జిల్లా నుంచి పారదోలేందుకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో డీఆర్వో జి.నరసింహులు, రీజినల్ మేనేజరు (టూరిజం) స్వామినాయుడు, డీపీఓ పి.జగదాంబ, జిల్లా వైద్య,ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, జిల్లా ఎయిడ్స్, లెప్రసీ, టీబీ కంట్రోల్ అధికారి డాక్టర్ ఎస్.వసుంధర, డీసీహెచ్ఎస్ డాక్టర్ సనత్ కుమారి పాల్గొన్నారు.

ఉద్యాన రైతుకు దన్ను..

- పంటల గ్రేడింగ్, క్లీనింగ్, ప్యాకింగ్, నిల్వ, క్రయ విక్రయాలకు ప్రోత్సాహం
- 28 కలెక్షన్ సెంటర్ల ఏర్పాటుకు ప్రణాళికలు
- ఒక్కో కేంద్రానికి రూ.15 లక్షల వెచ్చింపు
- ఇప్పటికే 14 కేంద్రాల నిర్మాణం పూర్తి
- రైతు ఉత్పత్తి దారుల సంఘాలకు ప్రయోజనం



రంగంపేట మండలం ఈలకొలను గ్రామంలో నిర్మాణం పూర్తి చేసుకున్న కలెక్షన్ సెంటర్‌లో ఉద్యాన అధికారులు, రైతులు

సాక్షి, రాజమహేంద్రవరం: ఉద్యాన పంటలకు వెన్నుదన్నుగా నిలిచేందుకు ప్రభుత్వం బృహత్తర ఘట్టానికి నాంది పలికింది. ఈ పంటలకు మరింత ప్రోత్సాహం అందించేందుకు కార్యాచరణ ప్రణాళిక అమలు చేస్తోంది. గిట్టుబాటు ధర కల్పించేందుకు రంగం సిద్ధం చేసింది. ఇందుకోసం ఎఫ్‌పీఓల(ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్), రైతు ఉత్పత్తి సంఘాల కోసం కలెక్షన్ సెంటర్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది.

జిల్లాలో ఇలా..

జిల్లాలో ఏటా 1,49,332 ఎకరాల్లో ఆయిల్‌పామ్, జీడిపప్పు, కొబ్బరి, మామిడి, అరటి తదితర పంటలు సాగవుతుంటాయి. 69,195 మంది రైతులు ఉద్యాన పంటలపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. గతంలో పంట ఉత్పత్తుల క్రయ విక్రయం, నిల్వ చేసేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు. సంత, మార్కెట్‌కు తరలించే క్రమంలో అవస్థలు పడేవారు. వీటిని శాశ్వతంగా దూరం చేసేందుకు, రైతులకు అండగా నిలిచేందుకు ప్రభుత్వం జిల్లా వ్యాప్తంగా 28 ప్రాంతాల్లో 'రైతు కలెక్షన్ సెంటర్ల' నిర్మాణాలకు అడుగులు వేసింది. ఒక్కో కేంద్రానికి రూ.15 లక్షలు ఖర్చవుతుందని అంచనా రూపొందించింది. ఈ మొత్తంలో ప్రభుత్వం 75 శాతం రాయితీ అంటే రూ.11.25 లక్షలు అందిస్తుంది. మిగిలిన 25 శాతం రూ.3.75 లక్షలు మండలాల వారీగా రూపుదిద్దుకున్న రైతు ఉత్పత్తి సంఘాలు సమకూర్చాల్సి ఉంటుంది.

జిల్లా వ్యాప్తంగా 25 రైతు ఉత్పత్తి సంఘాలు రూపుదిద్దుకున్నాయి. సంఘంలో 20 నుంచి 100 మంది రైతులు సభ్యులుగా ఉంటారు. వీరు కేంద్రాలను వినియోగించుకునే అవకాశం ఉంది. ప్రభుత్వ ఆదేశాలతో నిర్మాణ పనులు యుద్ధ ప్రాతిపదికన ప్రారంభమయ్యాయి. ఇప్పటికే 14 కేంద్రాల నిర్మాణం పూర్తయింది. మిగిలిన 14 సెంటర్లు వివిధ దశల్లో పురోగతిలో ఉన్నాయి. కేంద్రాలు అందుబాటులోకి వస్తే రైతులకు అనేక ఉపయోగాలున్నాయి. పండించిన పంటలు కేంద్రానికి తీసుకువచ్చి నిల్వ చేసుకోవచ్చు. అక్కడే శుభ్రం చేసుకోవడం, గ్రేడింగ్ చేసి పంట నాణ్యతకు అనుగుణంగా ప్యాకింగ్‌కు అవకాశం ఉంటుంది. సరుకు రవాణాకు అత్యంత అనుకూలం. వాహనాల్లో ఎక్కించి మార్కెట్‌కు తలరించేలా ఏర్పాట్లు ఉంటాయి. అన్నికంటే పంట రక్షణకు భరోసా ఉంటుంది.

జిల్లాలో ఉద్యాన పంటలు.. దిగుబడి వివరాలు

పంట	విస్తీర్ణం (ఎకరాల్లో..)	రైతులు	దిగుబడి (మెట్రిక్ టన్నుల్లో)
ఆయిల్ పామ్	43,190.19	11,293	3,45,521
జీడిపప్పు	27,895.24	12,469	13,389
కొబ్బరి	20,383.50	7,182	2.45(మిలియన్ నట్స్)
మామిడి	14,753.18	5,926	1,03,272
అరటి	14,680.74	9,677	1,61,488
ఇతర	28,429.07	22,648	1,12,716.28

రైతులకు ఉపయుక్తం



ఉద్యాన రైతుల శ్రేయస్సు దృష్ట్యా ప్రభుత్వం కలెక్షన్ సెంటర్లను అందుబాటులోకి తీసుకువస్తోంది. జిల్లా వ్యాప్తంగా 28 నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. అన్ని కేంద్రాలు పూర్తయితే ఉత్పత్తి దారుల సంఘాలకు ఎంతో ప్రయోజనం చేకూరనుంది. పంటలు నిల్వ, గ్రేడింగ్, క్రయ విక్రయాలకు వెసులుబాటు కలుగుతుంది.

– వి.రాధాకృష్ణ, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి

వైభవంగా కాండ్రకోట నూకాలమ్మ జాతర



అమ్మవారి జాతరకు హాజరైన భక్తులు

పెద్దాపురం: పెద్దాపురం మండలం కాండ్రకోట నూకాలమ్మ అమ్మవారి జాతర మహోత్సవం సోమవారం రాత్రి వైభవంగా ప్రారంభమైంది. ఆలయ కమిటీ అధ్యక్షుడు గవరసాని వీరాస్వామి, ఆలయ కార్యనిర్వాహణాధికారి తలాటం వెంకట సూర్యనారాయణ ఆధ్వర్యంలో ఈ వేడుకను ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు, మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్, జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి ఆవాల లక్ష్మీనారాయణ, ఎంపీపీలు పెంకే సత్యవతి, బొబ్బరాడ సత్తిబాబు, దేవదాయ శాఖ జిల్లా అధికారులు ప్రారంభించారు. ఈ సందర్భంగా హౌసింగ్ చైర్మన్ మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి ప్రతి ఒక్కరి సహకారం అవసరమన్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకున్నామన్నారు. పెద్దాపురం డీఎస్పీ సుంకర మురళిమోహన్ ఆదేశాల మేరకు సీఐ అబ్దుల్ నబీ, ఎస్‌ఐ వెలుగుల సురేష్‌ల ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆలయం వద్ద కోలాటం, గరగల నృత్యం, మ్యూజికల్ నైట్, దేవతామూర్తుల వేషధారణ, కాళికావేషాలు ఆకట్టుకున్నాయి.

క్రైం కార్నర్

శతాధిక వృద్ధురాలి మృతి


కర్నీడి చంద్రమ్మ (ఫైల్)

అంబాజీపేట: ఇరుసుమండకు చెందిన శతాధిక వృద్ధురాలు కర్నీడి చంద్రమ్మ (105) సోమవారం మృతి చెందారు. ఆమెకు కుమార్తె, కుమారుడు, తొమ్మిది మంది మనుమలు, మనుమరాళ్లు, 19 మంది మునిమనుమలు, మునిమనుమరాళ్లు ఉన్నారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

రంగంపేట: ఓ వ్యక్తి పామాయిల్ తోటలో అనుమానాస్పదంగా మృతి చెందాడు. ఏఎస్సై కె.నూకరాజు కథనం ప్రకారం.. జి.దొంతమూరుకు చెందిన నల్ల భద్రం (59) తంగేటి వెంకటేశ్వరరావుకు చెందిన పామాయిల్ తోటలో గెలలు కోయడానికి శనివారం ఉదయం వెళ్లాడు. అప్పటి నుంచీ ఇంటికి రాలేదు. సోమవారం మధ్యాహ్నం వరకూ వేచి చూసిన కుటుంబ సభ్యులు పామాయిల్ తోటలోకి వెళ్లి చూడగా అల్యూమినియంతో చేసిన పొడవాటి కత్తితో పామాయిల్ గెలలు కోస్తూ తోటలో విద్యుత్తు వైర్లు ఉన్నచోట కింద పడి మృతి చెంది కనిపించాడు. భద్రం కుటుంబ సభ్యుడు నల్ల లక్ష్మణరావు ఫిర్యాదు మేరకు పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బదనికలతో రక్షణ

- మిత్ర పురుగులతో హానికారక పురుగులకు చెక్
- కొబ్బరిలో యాజమాన్య పద్ధతులు పాటించాలి
- ఉద్యాన పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తల సూచన

పాడి-పంట

అంబాజీపేట: కొబ్బరిని ఆశించి, అపారంగా నష్టపరుస్తున్న నల్లముట్టి, ఎర్రముక్కు, ఆకుతేలు, రూగోస్ సర్పిలాకార తెల్లదోమ, బండార్స్ తెల్లదోమ వంటి పురుగుల నివారణ మిత్ర పురుగులతోనే సంపూర్ణంగా సాధ్యమవుతుందని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. అంబాజీపేట ఉద్యాన విశ్వవిద్యాలయం, ఉద్యాన పరిశోధన కేంద్రంలోని జీవనియంత్రణ ప్రయోగశాలలో అభివృద్ధి చేసిన మిత్ర పురుగులను (బదనికలు) కొబ్బరి తోటల్లో వదలడం ద్వారా హానికారక పురుగుల నివారణ సాధ్యమవుతుందని పరిశోధనల ద్వారా వెల్లడైంది. దీనిపై శాస్త్రవేత్తలు కొబ్బరి రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. రైతులందరూ ఏక కాలంలో పురుగుల నివారణ చర్యలు చేపడితే చాలావరకూ నియంత్రించవచ్చని చెబుతున్నారు. ఈ మిత్ర పురుగులను స్థానిక పరిశోధన కేంద్రం వద్ద రైతులకు అందిస్తున్నారు.

ఆకుతేలు (మాక్రోప్లైక్రా నరేరియా)

తొలి దశలో చిన్న గొంగళి పురుగులు ఆకు అడుగున పత్రహరితాన్ని గోకి తినడం వలన ఆకులపై గుండ్రని మచ్చలు ఏర్పడతాయి. గొంగళి పురుగు ఎదిగిన కొద్దీ ఆకు భాగాన్ని అంచుల నుంచి తిని, ఒట్టి ఈనెలను మాత్రమే మిగుల్చుతాయి. ఎండిన ఆకులు చెట్లకు వేలాడతాయి. ఉధృతంగా ఆశించినప్పుడు కమ్మలు, కాయలపై కూడా ఈ పురుగు ఆశిస్తుంది. ఉధృతి ఎక్కువగా ఉన్నప్పుడు చెట్ల కింద, చెట్టు చుట్టూ పురుగులు విసర్జించిన రెట్టలు ఒక పొరలా ఏర్పడతాయి. ఆకుతేలు ఆశించిన కొబ్బరి తోటల్లో అంతర పంటగా అరటి మరియు కోకో ఉంటే పురుగు అరటి, కోకోను కూడా ఆశిస్తుంది.

పెడోబియస్ ఇంబ్రియస్ (మిత్ర పురుగు)

ఆకుతేలు (గొంగళి పురుగు దశలో) నివారణకు తోటలో పెడోబియస్ ఇంబ్రియస్ 50 మిత్ర పురుగులు ఒక చెట్టుకు విడుదల చేయాలి. కనీసం ఎకరానికి 10 శాతం మొక్కలకు మిత్ర పురుగులను విడుదల చేయాలి.

తెల్లదోమలు

రూగోస్ సర్పిలాకార తెల్లదోమ, బొండార్స్ తెల్లదోమలు రసం పీల్చే తరగతికి చెందిన రెక్కల పురుగులు. ఆకుల అడుగు భాగాలపై గుడ్లు పెడతాయి. ఈ వలయాలపై తెల్లని మైనపు పూత, వెంట్రుకలు కప్పి ఉంటాయి. ఆకుల అడుగుభాగంలో తెల్లటి దూది వంటి పదార్థం నిండి ఉంటుంది. తేనెలాంటి జిగురు పదార్థం ఆకుల అడుగు భాగం నుంచి కింద ఉన్న ఇతర ఆకులపై పడి, అవి నల్లటి మసిరంగుతో కప్పబడిపోతాయి.

ఎపర్టోక్రైసా ఆస్టర్ (మిత్ర పురుగు)

తెల్లదోమ ఉధృతి తక్కువగా ఉన్నప్పుడే ఒక్కో చెట్టుకు ఎపర్టోక్రైసా ఆస్టర్ మిత్ర పురుగు గుడ్లు 100 నుంచి 150 లేదా 100 పిల్ల పురుగులు (గ్రబ్స్) విడుదల చేయాలి. మధ్యస్థంగా ఉన్నప్పుడు 300 - 500 గుడ్లు లేదా 300 పిల్ల పురుగులు విడుదల చేయాలి. ఈ విధంగా ఎకరాకు కనీసం 10 శాతం మొక్కలకు మిత్ర పురుగులు ఇవ్వాలి.

నల్లముట్టి పురుగు (ఒపిసైనా అరినోసెల్లా)

ఈ పురుగు ఆశించిన ఆకులపై ఎండిన మచ్చలు ఏర్పడతాయి. పురుగు తీవ్రత పెరిగిన కొద్దీ మచ్చలన్నీ కలిసిపోయి, ఆకు మొత్తం ఎండి, వాలిపోతుంది. తెగులు ఎక్కువ ఉధృతంగా ఉన్నప్పుడు కొబ్బరి కాయలు దెబ్బతింటాయి.


పురుగుల ఉధృతికి ఎండిపోయిన కొబ్బరి చెట్లు

బ్రాకాన్ బ్రెవికార్నీస్ (మిత్ర పురుగు)

తోటలో నల్లముట్టి పురుగు (గొంగళి పురుగు దశలో) ఉధృతి తక్కువగా ఉన్నప్పుడు,(చెట్టు ఆకులకు పురుగు ఆశించినప్పుడు బ్రెవికార్నీస్ మిత్ర పురుగులను ఒక చెట్టుకు 20 చొప్పున విడుదల చేయాలి. ఎకరానికి 10 శాతం మొక్కలకు మిత్ర పురుగులను విడుదల చేయాల్సి ఉంటుంది.

గోనియోజస్ నెఫాంటిడిస్ (మిత్ర పురుగు)

నల్లముట్టి పురుగు నివారణకు తోటలో ఒక్కో చెట్టుకు గోయియోజస్ నెఫాంటిడిస్ మిత్ర పురుగులు సుమారు 20 విడుదల చేయాలి. ఈ విధంగా ఎకరానికి కనీసం 10 శాతం మొక్కలకు మిత్ర పురుగులను విడుదల చేయాల్సి ఉంటుంది.

బదనికలతో ఫలితాలు



కొబ్బరిని ఆశించిన పురుగుల ఉధృతిని మిత్ర పురుగులతోనే తగ్గించవచ్చు. పురుగుల నియంత్రణకు యాజమాన్య పద్ధతులు పాటిస్తూ ఉధృతంగా ఉన్న కొబ్బరి చెట్లపై మిత్ర పురుగులను ఉపయోగించాలి. శాస్త్రవేత్తల సూచనల మేరకు ఈ బదనికలను వినియోగించడం వల్ల ఫలితాలు పొందవచ్చు. పరిశోధన కేంద్రంలో మిత్ర పురుగులను రైతులకు కనీస ధరకు విక్రయిస్తున్నాం.

– బి.శ్రీనివాసులు, అధిపతి, ఉద్యాన పరిశోధన కేంద్రం, అంబాజీపేట

గాలి పెడుతుండగా పేలిన టైరు

- పే లోడర్ డ్రైవర్ దుర్మరణం
- ప్యారీ షుగర్స్ వద్ద ప్రమాదం


ప్రమాదానికి కారణమైన పే లోడర్‌ను పరిశీలిస్తున్న అధికారులు


మృతుడు శివకుమార్ (పాత చిత్రం)

కాకినాడ రూరల్: వాకలపూడి ఏపీఐఐసీ పారిశ్రామిక వాడలోని ప్యారీ షుగర్స్ పరిశ్రమ వద్ద సోమవారం పే లోడర్ వాహనం టైరు పేలి డ్రైవర్ పెనుబోతు శివకుమార్ (32) దుర్మరణం పాలయ్యాడు. సర్పవరం పోలీసుల కథనం ప్రకారం.. కాకినాడ రూరల్ తూరంగి మహాలక్ష్మి నగర్‌కు చెందిన శివకుమార్ ప్యారీ షుగర్స్‌లో ఐదేళ్లుగా పే లోడర్ వాహనం డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఉదయం 9.40 గంటల ప్రాంతంలో గాలి పెడుతూండగా పే లోడర్ టైరు ఒక్కసారిగా పేలిపోయింది. దాని డ్రమ్ము తలపై బలంగా తగలడంతో శివకుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. డ్రమ్ము తగిలిన వేగానికి అతడి మెదడు బయటకు వచ్చేసింది. ప్రమాదం జరిగిన వెంటనే స్పందించిన యాజమాన్యం శివకుమార్‌ను అంబులెన్స్‌లో కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించింది. అప్పటికే అతడు మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. శివకుమార్‌కు ఏడాది కిందట వివాహమైంది. భార్య భవాని, 11 నెలల బాబు ఉన్నారు. సాఫీగా సాగిపోతున్న జీవితంలో ఊహించని ప్రమాదం జరగడంతో ఆమె కుంగిపోయింది. తన భర్త చనిపోయాడనే చేదు నిజం జీర్ణించుకోలేక వెక్కివెక్కి రోదించింది.

కార్మికుల ఆందోళన : గతంలో ప్యారీ షుగర్స్‌లో వరుసగా జరిగిన రెండు ప్రమాదాల్లో నలుగురు మృతి చెందారు. ఈ నేపథ్యంలో మరో ప్రమాదం జరిగిందనే సమాచారంతో సర్వత్రా భయాందోళనలు వ్యక్తమయ్యాయి. శివకుమార్ మృతి వార్త తెలియడంతో కార్మిక నాయకులు, మృతుడి భార్య భవాని, కుటుంబ సభ్యులు ఫ్యాక్టరీ వద్దకు చేరుకుని ఆందోళనకు దిగారు. మత్స్యకార సామాజిక వర్గానికి చెందిన బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ కాకినాడ జగన్నాథపురం ఏటిమొగ, తూరంగి మహాలక్ష్మి నగర్ నుంచి పెద్ద ఎత్తున మత్స్యకారులు తరలివచ్చి ఆందోళన నిర్వహించారు. కాకినాడ డీఎస్పీ మురళీకృష్ణారెడ్డి, రూరల్, టూ టౌన్ సీఐలతో పాటు ఇతర పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఆందోళనకారులను గేటు లోపలకు అనుమతించలేదు.

స్పందించిన యాజమాన్యం : ఆందోళన నేపథ్యంలో ప్యారీ షుగర్స్ యాజమాన్యం స్పందించింది. పరిశ్రమలో మంగళవారం మధ్యాహ్నం జరిగిన చర్చల్లో మృతుని భార్య భవానీకి ఉద్యోగం ఇవ్వడానికి, యాజమాన్యం నుంచి రూ.40 లక్షలు, మట్టి ఖర్చులకు మరో రూ.లక్ష, వర్క్‌మన్ కాంపన్సేషన్ కింద రూ.10 లక్షలు, పే లోడర్ కాంట్రాక్టర్ రూ.5 లక్షలు కలిపి మొత్తం రూ.56 లక్షల వరకూ అందించేందుకు అంగీకారం కుదిరింది. ప్రమాద స్థలాన్ని డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ రాధాకృష్ణ పరిశీలించారు. టైరుకు ఎక్కువ గాలి పెట్టడం వలన, అది పేలి, డ్రమ్ వద్ద ఐరన్ హోరింగ్ తగిలి శివకుమార్ మృతి చెందాడని తెలిపారు. ప్రమాదంపై సర్పవరం ఎస్సై సతీష్‌బాబు కేసు నమోదు చేశారు. మృతదేహానికి జీజీహెచ్‌లో పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగిస్తామని చెప్పారు.

ఆ ఆసుపత్రుల సంగతి తేల్చండి

- వెంటనే విచారణ చేపట్టండి
- డీఎంహెచ్‌ఓలు, ఆరోగ్యశ్రీ డీసీలకు కలెక్టర్ల ఆదేశాలు
- 24న ఆరోగ్యశ్రీ ఆసుపత్రుల యాజమాన్యాలతో సమావేశం
- 'వైద్యో నారాయణో హరిహరీ'పై స్పందన


వైద్యో నారాయణో హరిహరీ..

సాక్షి ఇంపాక్ట్

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): 'వైద్యో నారాయణో హరిహరీ' శీర్షికన 'సాక్షి' ప్రచురించిన కథనంపై తూర్పు గోదావరి, కాకినాడ కలెక్టర్లు స్పందించారు. కొన్ని ప్రైవేటు ఆసుపత్రుల్లో రోగులను దోచుకుంటున్న తీరుపై వెంటనే విచారణ చేపట్టాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కొన్ని ప్రైవేటు ఆసుపత్రుల్లో వైద్యుడు చూడకుండానే అక్కడి సిబ్బంది వేల రూపాయల వైద్య పరీక్షలు రాయడం.. ఆరోగ్యశ్రీలో అవకతవకలకు పాల్పడుతున్న వైనాన్ని 'సాక్షి' వెలుగులోకి తెచ్చింది. దీనికి సంబంధించి తూర్పు గోదావరి జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి (డీఎంహెచ్‌ఓ) డాక్టర్ వెంకటేశ్వరరావు, ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్ ప్రియాంకలను కలెక్టర్ కె.మాధవీలత వివరణ కోరారు. సంబంధిత ఆసుపత్రుల వివరాలను తమకు అందించాలని ఆదేశించారు. ఈ మేరకు ఆయా అధికారులు కలెక్టర్‌కు రెండు రోజుల్లో నివేదిక అందించనున్నారు. అన్ని ఆరోగ్యశ్రీ ఆసుపత్రుల యాజమాన్యాలతో ఈ నెల 24న కలెక్టరేట్‌లో కలెక్టర్ సమావేశం కూడా నిర్వహించనున్నారు. అలాగే కాకినాడ జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలాక్కియ కూడా ఈ కథనానికి స్పందించారు. సంబంధిత వైద్యాధికారులను ఆరా తీశారు. ఆరోగ్యశ్రీ జిల్లా కో ఆర్డినేటర్ రాధాకృష్ణను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్యశ్రీ అమలు తీరును ఆమెకు రాధాకృష్ణ వివరించారు. 'సాక్షి'లో ప్రచురితమైన కథనంపై విచారణ జరుపుతామని, వివరాలు అందజేస్తామని జేసీకి రాధాకృష్ణ తెలిపారు.

ఫిలిప్పీన్స్ మెడికల్ సెంటర్‌తో జీఎస్ఎల్ ఒప్పందం


ఒడంబడిక పత్రాలను మార్చుకుంటున్న జీఎస్ఎల్, ఫిలిప్పీన్స్ ప్రతినిధులు

రాజానగరం: ఫిలిప్పీన్స్ ప్రభుత్వం మనీలాలో నిర్వహిస్తున్న 'ఈస్ట్ ఎవెన్యూ మెడికల్ సెంటర్'తో స్థానిక జీఎస్ఎల్ వైద్య కళాశాల అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదుర్చుకుంది. ఎంఓయూ పత్రాలపై ఉభయ సంస్థల ప్రతినిధులు డాక్టర్ రెనె లూయీ గుటిరెజ్, డాక్టర్ గన్ని భాస్కరరావు సోమవారం సంతకాలు చేసి, పరస్పరం మార్చుకున్నారు. ఈ ఒప్పందాన్ని అనుసరించి, పరిజ్ఞానాన్ని పరస్పరం పంచుకునేందుకు, ఇక్కడి నుంచి విద్యార్థులను ఏటా మనీలాకు పంపించేందుకు, అధ్యాపకులు కూడా ఉభయ విద్యాసంస్థల మధ్య రాకపోకలు సాగించి, విజ్ఞానాన్ని పంచుకునేందుకు అవకాశం ఉంటుందని డాక్టర్ గన్ని భాస్కరరావు తెలిపారు. 'జీఎస్ఎల్ గోస్ గ్లోబల్'లో భాగంగా ఈ ఒడంబడిక కుదుర్చుకున్నామన్నారు. జీఎస్ఎల్ కేన్సర్ ఆస్పత్రిలోని సర్జికల్ ఆంకాలజిస్టు డాక్టర్ గోగినేని తరుణ్, జీఎస్ఎల్ డెంటల్ కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ గోవిందరాజులును తమ సెంటర్‌కు విజిటింగ్ ఫ్యాకల్టీలుగా నియమించామని ఈస్ట్ ఎవెన్యూ మెడికల్ సెంటర్ ఈఎన్‌టీ హెచ్‌ఓడీ డాక్టర్ రెనె లూయీ తెలిపారు. ఏటా తమ దేశం నుంచి ఇద్దరు విద్యార్థులు ఇక్కడకు వచ్చి చదువుకుంటారన్నారు. ఈవిధంగా ఎంఓయూ కుదుర్చుకోవడంతో పాటు విదేశాల నుంచి ఫ్యాకల్టీని నియమించుకోవడం ఇదే మొదటిసారని చెప్పారు. ఈ సందర్భంగా ఈ రెండు సంస్థల ఆధ్వర్యంలో వచ్చే ఏడాది మార్చి 25, 26, 27 తేదీల్లో ఈఎన్‌టీ, ఈస్థటిక్స్ ఆంకాలజీ సర్జరీలపై అంతర్జాతీయ సదస్సు నిర్వహిస్తామని ప్రకటించారు. ఫిలిప్పీన్స్ నుంచి వచ్చిన వారిలో రెనె లూయీతో పాటు డాక్టర్ కార్లో, డాక్టర్ పెన్నా నివాస్ ఉన్నారు. కార్యక్రమంలో డాక్టర్ గన్ని సందీప్, డాక్టర్ గోగినేని తరుణ్, డాక్టర్ గోవిందరావు కూడా పాల్గొన్నారు.

శ్రీలంక వర్సిటీతో కూడా ఒప్పందం


జీఎస్ఎల్ సంస్థలకు శ్రీలంకలోని ప్రభుత్వ యూనివర్సిటీ 'పెరండీనియా'కు మధ్య కూడా అవగాహన ఒప్పందం కుదిరింది. సంబంధిత ఎంఓయూపై జీఎస్ఎల్ డైరెక్టర్ డాక్టర్ గన్ని సందీప్ సంతకం చేశారు. శ్రీలంక నుంచి నుంచి ఏటా ఒక విద్యార్థి వచ్చి, జీఎస్ఎల్లో చదువుకుంటారు. ఇందులో భాగంగా ఈ నెల 16, 17, 18 తేదీల్లో పెరిండీనియా యూనివర్సిటీ, కాలేజ్ ఆఫ్ డెంటల్ సర్జరీస్, జీఎస్ఎల్ సంస్థలు కొలంబోలో సంయుక్తంగా మొదటి అంతర్జాతీయ నెక్ అండ్ ఓరల్ క్యాన్సర్ సర్జరీ కాన్ఫరెన్స్ నిర్వహించాయి. అందులో డాక్టర్ తరుణ్, డాక్టర్ గోవిందరాజు కీలకోపన్యాసాలు చేశారని తెలిపారు.

గంజాయితో నలుగురి అరెస్టు


పట్టుబడి గంజాయి, నిందితులతో తహసీల్దార్ శ్రీనివాస్, ఎస్సై శివనాగబాబు

గోకవరం: రెండు వాహనాల్లో గంజాయి తరలిస్తున్న నలుగురు వ్యక్తులను గోకవరం పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. ఎస్సై యూవీ శివనాగబాబు కథనం ప్రకారం.. మండలంలోని కొత్తపల్లి శివారు పెద్ద చెరువు వద్ద చాకలిరేవు సమీపాన గంజాయిని తరలించేందుకు పడాల కన్నబాబు (రాజానగరం మండలం నందరాడ), మంగల బాలరాజు (రంపచోడవరం మండలం చిన్నబీరంపల్లి), కొనుతురి కృష్ణ (అడ్డతీగల మండలం భీముడుపాకలు), తడాల నాగ రవితేజ (గోకవరం మండలం కొత్తపల్లి) రెండు వాహనాలతో సిద్ధంగా ఉన్నారు. వారిని పోలీసులు అరెస్టు చేశారు. తహసీల్దార్ శ్రీనివాస్ సమక్షంలో వారి నుంచి రూ.1.10 లక్షల విలువైన 24 కేజీల గంజాయి, రూ.4,500 నగదు, రెండు బైక్‌లు, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రిమాండుకు తరలించారు.

యువకుడి మృతదేహం లభ్యం


సాయికిరణ్ (పాతచిత్రం)

కొవ్వూరు: ఔరంగబాద్ సమీపాన గోదావరిలో సోమవారం యువకుడి మృతదేహం లభ్యమైంది. పట్టణ ఎస్సై డి.భూషణం కథనం ప్రకారం.. నిడదవోలుకు చెందిన జడ్డు సాయికిరణ్ (24) ఓ ప్రైవేటు సంస్థలో ఉద్యోగం చేస్తున్నాడు. రోజూ మాదిరిగానే అతడు ఈ నెల 18న ఇంటి నుంచి డ్యూటీకి బయలుదేరాడు. మధ్యాహ్నం ఇంటికి వచ్చి, భోజనం చేసి వెళ్లి మళ్లీ తిరిగి రాలేదు. అతడి ఆచూకీ కోసం తండ్రి పండుదొర ఆ సంస్థతో పాటు, స్నేహితులు, బంధువుల ఇళ్ల వద్ద రెండు రోజులుగా గాలిస్తున్నాడు. ఈ నేపథ్యంలో గోదావరిలో ఓ యువకుడి మృతదేహం తేలుతున్నట్టు ఔరంగబాద్‌కు చెందిన కొందరు సమాచారం ఇచ్చారు. అక్కడకు వెళ్లి చూసి, ఆ మృతదేహం తన కుమారుడు సాయికిరణ్‌దేనని పండుదొర గుర్తించాడు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించి, అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

బాలికను కిడ్నాప్ చేసిన వ్యక్తి అరెస్టు

గండేపల్లి: బాలికను కిడ్నాప్ చేసిన వ్యక్తిని అరెస్టు చేసినట్టు గండేపల్లి ఎస్సై వై.గణేష్ కుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండలంలోని కె.గోపాలపురానికి చెందిన 14 ఏళ్ల బాలిక గండేపల్లి హైస్కూల్‌లో తొమ్మిదో తరగతి చదువుతోంది. అదే గ్రామానికి చెందిన వివాహితుడు వేమగిరి సత్యానందం కొంత కాలంగా ఆ బాలిక వెంటపడి వేధిస్తున్నాడు. దీనిపై పెద్దల సమక్షంలో పలుమార్లు హెచ్చరించారు. ఈ నేపథ్యంలో ఈ నెల 7న స్కూల్‌కు వెళ్లేందుకు ఆటో కోసం ఇంటి బయట వేచి ఉన్న ఆ బాలికకు సత్యానందం మాయ మాటలు చెప్పి, మోటార్ సైకిల్‌పై కిడ్నాప్ చేసి తీసుకుపోయాడు. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు అనంతరం ముద్దాయిని సోమవారం అరెస్ట్ చేశారు. కిడ్నాప్‌కు ఉపయోగించిన మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు.